# బంగారు దొంగ



చిట్ట మధ్యాహ్నం వేళ!

నడినెత్తిన సూర్యుడు చండ్ర నిప్పులు కురిపిస్తున్న వేళ!
సెగలు పొగలుగా వడగాలి ఎడాపెడా కొడ్తున్న వేళ!

దేవాలయం గోపురాల్లోని రామచిలుకలూ, పావురాళ్లూ గూళ్ళలోంచి తలలు బయటపెట్టలేని వేళ!

అలనాడు రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు ఎత్తయిన ధ్వజస్తంభాలకూ, శిఖరాలకూ రాగిరేకు చుట్టింపించి ఆ రేకుమీద బంగారు పూతపూయించగా, ఆ బంగారం ఎవ్వరూ చూడని సమయాన ధగధగ మెరుస్తున్న వేళ!
పెద్ద గుడి ఆవరణంతా పట్టపగలే అర్ధరాత్రిలా పరమ నిశ్శబ్దంగా వున్న వేళ!

పంచాయితీ బోర్డులో పనిచేసే జానకిరామయ్య మొలల వ్యాధితో బాధపడుతూ చుర్రుమనే ఎండని లెక్కచెయ్యకుండా చెంబట్టుకుని పరుగెత్తుతున్నాడు. ఆ పరుగులో తన చెప్పులకిర్రు తప్ప మరేవీ వినిపించని సమయాన, ఎక్కడినుంచో

"బర్ బర్" అన్న శబ్దం.

మళ్ళీ "బర్ బర్ బర్."
జానకిరామయ్య పరుగు ఆగిపోయింది.
ఇంకా "బర్ బర్ బర్ బర్"

తలెత్తి పైకి చూశాడు. చేతనున్న చెంబు ఠంగున కింద పడిపోయింది. ఓ నల్లటి జీబు తలవాడు ధ్వజస్తంభానికి పూదిన బంగారం మీద మెరుగుకాగితంతో రుద్దుతున్నాడు. "బర్ బర్ బర్"

గుండెలవిసిపోయాయి జానకిరామయ్యకి.

'రేయ్' అని కేక వెయ్యబోతే గొంతు అర్చుకుపోయి మాటరాలేదు. కిందపడ్డ చెంబుసంగతి మర్చిపోయి ఒక్క పరుగున పూజారి వీధిలో కొచ్చి పడ్డాడు. "గు .... గుళ్ళో దొంగ, ధ్వజస్తంభానికి ...... మె..... మెరుగు కాగితం రుద్దుతున్నాడు" ఒగర్చుకుంటూ చెప్పాడు.

జనమంతా ఇళ్ళలోంచి వచ్చారు. పూజార్లు, పాలేళ్ళు, చిన్నా పెద్దా తోసుకొచ్చారు. కర్రలూ బడితెలూ చేతబట్టారు. పల్లపీధికి కబురెళ్ళింది. ఏటివొడ్డున బట్టలుతుకుతున్న చాకలోళ్ళకి కబురెళ్ళింది. రేవులో పడవలు, లాంచీలు ఆగిపోగా ఆ జనమంతా పరిగెత్తుకొచ్చారు. "గుళ్ళో దొంగ ... గుళ్లో దొంగ ....." నిమిషాల్లో వూళ్లోకి చిచ్చులా పాకిపోయింది. దాదాపు రెండొందలమంది జనం కర్రలు చేతబట్టి గుడిని ముట్టడించారు.

గొప్ప ఆవేశం.
గొప్ప సరదా!

నడి ఎండలో కాళ్లు చుర్రుమంటున్నా లెక్కచేయకుండా పరుగులు. "ఓహోయ్ .... ఒరేయ్ .... " అని వీరావేశంతో రణకేకలు, పిల్లలు పళ్ళాలు, కంచాలు మోగిస్తున్నారు. పెద్దగుడి ఆవరణంతా అరుపుల్తో కేకల్తో నిండిపోయింది. ఈ అలజడికి దొంగ ధ్వజస్తంభం దిగి పోయాడు.

రెండో ప్రాకారం తలుపులు తీశారు. దొంగ పారిపోకుండా రెండో ప్రాకారంలోని

చిన్న గుళ్ళన్నీ వెతకాలన్నారు. జట్లు జట్లుగా విడిపోయారు. రెండు ముఖ ద్వారాల దగ్గర రెండు జట్లు, కృష్ణవైపు ప్రహరీ గోడదూకి పారిపోకుండా అక్కడ ఒక జట్టు, పున్నాగచెట్ల దగ్గర ఇంకో జట్టు, మారేడు చెట్లపై మరో జట్టు, గన్నేరు చెట్ల గుబుర్ల దగ్గర వేరే జట్టు. పెద్ద జట్టు ప్రహరీలోని చిన్న గుళ్ళన్నీ వెదుకుతోంది. ప్రతి చిన్న గుడిముందు ఆగి పళ్ళాలు, కంచాలు మోగిస్తూ "రేయ్! రారా బయటికి"అని కేకలు. గుడిలోపలికెళ్ళి చూసొచ్చి "కాలభైరవుడి గుళ్ళోలేడు, కుమారస్వామి గుళ్ళో లేడు .... చండేశ్వరుడి గుళ్ళో లేడు" అని అరుస్తే ఎప్పటి కప్పుడు వార్త లందించటాలు. రెండో ప్రాకారమంతా గాలించారు. దొంగ దొరకలేదు.

"పదండి పై ప్రాకారానికి."

"హోయ్ ... హోయ్" అరుపుల కేకలతో జనమంతా పై ప్రాకారాని కొచ్చారు. ప్రతి చిన్న గుడీ గాలించారు. ప్రతి రాయి వెనుకా వెతికారు. ప్రతి మూలా చూశారు. ప్రతి గుబురూ కదలేశారు. ఎట్టకేలకు వినాయకుడి గుడిలో విగ్రహం చాటున దాక్కున్న దొంగని పట్టారు.

పట్టీ పట్టడంతోటే నల్లగా చింతమొద్దులా ఉన్న దొంగని జుట్టుపట్టుకు బయటికి లాగారు. 'ఛెళ్ ఛెళ్' మని చెంపలు పగలగొట్టారు. 'ఫెడీ ఫెడీ' మని తన్నారు. నరాలు విరగదీశారు. వెన్ను పగిలేట్టు కుమ్మారు. మెట్లమీంచి జరజర ఈడ్చుకొచ్చి జమ్మిచెట్టుకి మోకుతో కట్టేశారు.

ఊరు ఊరంతా కదిలొచ్చింది దొంగని చూడ్డానికి. ఆడవాళ్ళు పిల్లల్ని చంకనేసుకుని పరుగెత్తుకొచ్చారు.

'ఎలుగుబంటిలా ఉన్నాడు దొంగ!'

'పందికొక్కులా ఉన్నాడు దొంగ!

ఒక్క పలుకు లేదు, ఒక మాటలేదు, వొళ్ళంతా గీరుకుపోయి నెత్తురోడుతుంటే కళ్ళప్పగించి చూస్తున్నాడు దొంగ. వచ్చిన ప్రతివాడూ దొంగని కొడ్తున్నాడు. చిన్న పిల్లలు సైతం సరదాకి వెళ్ళి తన్ని వస్తున్నారు. తిట్టని ఆడది లేదు.

వుమ్మెయ్యని మనిషి లెడు.

ఊరి పెద్దలొచ్చారు. భూషయ్య, రామయ్య, అవధాన్లు మొదలైనవారు.

"గుళ్ళో దొంగతనం చేస్తావంట్రా లం .... కొడకా" మోకుతో ఛెళ్‌ఛెళ్ మని కొడ్తూ తిట్టాడు భూషయ్య. దొంగ వొంటిమీద కరుళ్ళు తేలాయి. "దేవుడు సొమ్ము తింటే కుక్కవై పుడ్తావురా" అంటూ అవధాన్లుగారు మొహంమీద గుద్దాడు. దొంగ భళ్లున నెత్తురు కక్కాడు.

"చస్తాడు నాయాలు" అంటూ రామయ్య కర్రతో దొంగ మెణికలమీద కొట్టాడు. దేవుడికి ప్రతివాడూ తనచేత్తో ఓ మారేడు దళం వేసినట్టు, అక్కడి కొచ్చిన ప్రతివాడు దొంగని ఓ దెబ్బ పీకారు.

నల్లటి జీబుతల దొంగ శరీరమంతా కరుళ్లు తేలి అక్కడక్కడా నెత్తురు కారుతోంది. గాజుబుడ్లలాటి వాడి కళ్ళు మూసుకుపోతున్నాయి.

"పోలీసోళ్ళ కేసేద్దావా వీణ్ణీ" అన్నారెవరో.

"రాత్రల్లా కట్టిపడేసి, కీళ్ళిరగదీసి పంపిస్తే సరి. మా పాలేళ్ళని కాపలా పెడ్తాలే" అన్నాడు ఊరిపెద్ద భూషయ్య.

వాడు దొంగ!

వాణ్ని కొట్టాల్సిందే! నరకాల్సిందే! ముక్కలు ముక్కలు చెయ్యాల్సిందే! కాకులకి, గద్దలకి వెయ్యాల్సిందే? దేవుడు సొమ్ము దొంగతనం చేశాడు! కుక్కజన్మ ఎత్తుతాడు! పందిగా పుడ్తాడు.

తిట్టుకుంటూ జనమంతా వెళ్ళిపోయారు.

అర్ధరాత్రి దాటాక భూషయ్య స్వయంగా దొంగకి కట్లు విప్పి "లం ... కొడకా! తెలివి తేటలక్కర్లా" అంటూ ఐదు పది రూపాయల నోట్లు చేతిలో పెట్టి "శివరాత్రి వెళ్ళింతర్వాత కనపడు" అన్నాడు.

వినాయకుడి విగ్రహం వెనకాల దాచిన బంగారపు మెరుగు కాగితాల్ని వెనకటి వాటితో కలిపి భూషయ్య భోషాణంలో భద్రపరుచుకోగా, కిరాయి దొంగ కునికినపాడు రేవు వైపు తూలుకుంటూ పోయాడు.*